సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 12 । డిసెంబర్ । 2023



మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు
రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాస్టర్స్ సత్తాచాటారు. మొత్తంగా 40 వరకు పతకాలు సాధించారు. 8లో ▸



పెళ్లింట పెను విపత్తు
నవ వధూవరులు సముద్ర స్నానానికి వెళ్లి గల్లంతు కావడంతో గుర్వాయిపాలెం, జువ్వలపాలెంలో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. 8లో ▸



బాధితులకు సత్వర న్యాయం
స్పందనలో ఫిర్యాదులు, వినతులు సమర్పించిన బాధితులకు సత్వర న్యాయం అందిస్తామని ఏలూరు ఎస్పీ డి.మేరీప్రశాంతి తెలిపారు. 8లో ▸

న్యూస్‌రీల్

గవర్నర్ పర్యటనకు సర్వం సిద్ధం



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జేసీ లావణ్యవేణి

దెందులూరు: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మంగళవారం దెందులూరు మండలం గాలాయగూడెం గ్రామంలో పర్యటిస్తారని, ఈ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్టు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. సోమవారం గాలాయగూడెంలోని శ్రీ కృష్ణా కన్వెన్షన్ హాలును ఆమె పరిశీలించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం 8.35 గంటలకు విజయవాడ రాజ్‌భవన్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి ఉదయం 10.55 గంటలకు గాలాయగూడెం గ్రామానికి గవర్నర్ చేరుకుంటారన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.40 వరకు ఇక్కడ కార్యక్రమంలో పాల్గొని, మధ్యాహ్నం 12.45 గంటలకు రోడ్డు మార్గంలో విజయవాడ బయలుదేరతారన్నారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఇన్‌చార్జి మంత్రి పినిపే విశ్వరూప్, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారన్నారు.

జిల్లా అధికారుల పరిశీలన
గాలాయగూడెం శ్రీ కృష్ణా కన్వెన్షన్ హాలును జేసీ లావణ్యవేణి, ఎస్పీ డి.మేరిప్రశాంతి, జెడ్పీ సీఈఓ సుబ్బారావు, ఆర్డీఓ ఖాజావలీ, పలువురు ఆర్‌డీఓలు, ఇతర శాఖల అధికారులు, తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, ఎంపీడీఓ భీమరాజు, సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు సోమవారం పరిశీలించారు.

మానవత్వం చాటుకున్న పీవీఎల్

ఉండి: డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చొరవతో వైఎస్సార్‌సీపీ నాయకులు రోడ్డు ప్రమాద బాధితులకు వెన్నంటి ఉండి ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నార్పీ అగ్రహారం పాల కేంద్రం వద్ద సోమవారం సాయంత్రం జాతీయ రహదారిపై ఉండి వైపు వస్తున్న ఆటోను కారు ఢీకొట్టింది. దీంతో ఆటోలోని ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఆటో రోడ్డు పక్కకు ఒరిగిపోగా ప్రయాణికులు ఆర్తనాదాలు చేశారు. అదే సమయంలో అటుగా వెళుతున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తనతో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు, కో–ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ కరిమెరక శివనాగరాజు, నాయకులు గలావిల్లి ధనుంజయ, మున్నలూరి శ్రీనివాస్‌కు ఆదేశించడంతో ఆటోలో ఇరుక్కున ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. 108 సాయంతో వారిని చికిత్స నిమిత్తం భీమవరం తరలించారు. ఏఎస్సై ఎ.సూర్యనారాయణ ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆరుగురు క్షతగాత్రుల్లో ముగ్గురు ప్రైవేట్ ఆస్పత్రిలో, ముగ్గురు ప్రభుత్వాస్పత్రిలో చేరారు. ప్రభుత్వాస్పత్రిలో చేరిన ముగ్గురిలో ఇద్దరిని ఉన్నత వైద్యం కోసం వైద్యులు విజయవాడ రిఫర్ చేశారు.

సకాలంలో అర్జీల పరిష్కారం

భీమవరం (ప్రకాశంచౌక్): స్పందన కార్యక్రమంలో అందించిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో బి.శ్రీమన్నారాయణరెడ్డి, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కానాల సంగీత మాధుర్, జిల్లా వార్డు, గ్రామ సచివాలయం అధికారి కెసీహెచ్ అప్పారావు, పీడీడీఆర్‌డీఏ వైఎస్ఎస్ ప్రసాద్, జిల్లా హౌసింగ్ అధికారి ఆర్‌సీ ఆనంద్‌కుమార్, డీఎస్పీ బి.శ్రీనాథ్‌తో కలిసి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. స్పందనలో 227 అర్జీలు స్వీకరించినట్టు చెప్పారు. వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేట్ క్రిమినల్ సభ్యుడు మేళ్లం దుర్గాప్రసాదు, అధికారులు పాల్గొన్నారు.

పనులను వేగిరపర్చాలి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రభుత్వం నిర్దేశించిన అంశాలను వేగవంతం చేయాలని అమరావతి నుంచి స్పెషల్ చీఫ్ సెక్రటరీ రేవు ముత్యాలరాజు, రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ టి.విజయకుమార్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఆడుదాం ఆంధ్ర, రెవెన్యూ తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. భీమవరం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, అధికారులు హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇళ్ల స్థలాల కోసం సోమవారం వరకు 61 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని జేసీ వివరించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం.దుర్గారావు, డిప్యూటీ తహసీల్దార్ ఈ.నాగార్జున, మెజిస్ట్రీరియల్ సూపరింటెండెంట్ ఆర్.రాంబాబు పాల్గొన్నారు.

ధాన్యం.. సొమ్ములు సత్వరం

రైతు సంక్షేమానికి ప్రా'ధాన్యం'
- త్వరితగతిన ధాన్యం సొమ్ము చెల్లింపు
- రెండు నుంచి ఏడు రోజుల్లోపు రైతుల ఖాతాలకు జమ
- 1.69 లక్షల టన్నుల ధాన్యం సేకరణ
- ఇప్పటివరకు రూ.264 కోట్ల చెల్లింపు
- అన్నదాతల హర్షం



మార్టేరు-అత్తిలి రోడ్డులోని మిల్లు వద్ద ధాన్యం ట్రాక్టర్లు



మిల్లుకు తరలించేందుకు ధాన్యం బస్తాలను సిద్ధం చేస్తున్న రైతులు

సాక్షి, భీమవరం: వ్యవసాయాన్ని పండగ చేయాలన్న సంకల్పంతో రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివిధాలా అండగా ఉంటున్నారు. ధాన్యం సేకరణ, సొమ్ముల చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో జిల్లావ్యాప్తంగా అధికారులు ముమ్మరంగా ధాన్యం సేకరణతో పాటు ధాన్యం సొమ్ములను సత్వరమే రైతుల ఖాతాలకు జమచేస్తున్నారు. నిర్ణీత మూడు వారాల గడువుకన్నా ముందే రైతుల ఖాతాలకు ధాన్యం డబ్బులు జమవుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో 1.69 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా ఇప్పటివరకు 72 శాతం మేర చెల్లింపులు చేయడం గమనార్హం. ఆన్‌లైన్ చేసిన రెండు, మూడు రోజుల్లోనే ధాన్యం డబ్బులు చేతికి అందుతుండటంపై అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

4.21 లక్షల టన్నుల అంచనా..
జిల్లాలో 2.13 లక్షల ఎకరాల్లో రైతులు తొలకరి సాగు చేశారు. ముందుగా నాట్లు వేసిన తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, గణపవరం తదితర మండలాల్లో చాలావరకు కోతలు పూర్తికాగా మిగిలిన చోట్ల మాసూళ్లు జరుగుతున్నాయి. 4.21 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారుల అంచనా.

జిల్లాలో ధాన్యం సేకరణ

రైతులు	24,722
సేకరించిన ధాన్యం	1.69 లక్షల టన్నులు
ధాన్యం విలువ	రూ.368.66 కోట్లు

సొమ్ముల జమ

రైతులు	ఖాతాలకు జమ
17,670 మంది	రూ. 263.87 కోట్లు

సివిల్ సప్లయిస్ ఆధ్వర్యంలో 314 రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే), 119 సొసైటీల ద్వారా ధాన్యం సేకరణ చేస్తున్నారు.

అడుగడుగునా అండగా..
దళారులు, కమీషన్ వ్యాపారుల దోపిడీకి అడ్డుకట్ట వేసి మద్దతు ధరను అందించేందుకు ధాన్యం కొనుగోలును ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహిస్తోంది. ఆర్‌బీకే సిబ్బంది నేరుగా పొలాల్లోకి వెళ్లి తేమశాతం శాంపిల్స్ సేకరించి సక్రమంగా ఉన్న వాటిని వెంటనే రైసుమిల్లులకు తరలిస్తున్నారు. ఇప్పటివరకు 24,722 మంది రైతుల నుంచి 1.69 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించారు. మిచాంగ్ తుపానుపై వాతావరణశాఖ హెచ్చరికలతో అప్రమత్తమైన ప్రభుత్వ యంత్రాంగం రైతులు నష్టపోకుండా సడలింపులు ఇచ్చి ఆఫ్‌లైన్‌లోనూ కల్లాల్లోని 45 వేల టన్నుల ధానాన్ని మిల్లులకు తరలించింది. అనంతరం ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేశారు. జిల్లాలో తుపాను ప్రభావం తర్వాత నాలుగు రోజులుగా వరి కోతలు, మాసూళ్లు ముమ్మరంగా జరుగుతుండటంతో ధాన్యం కొనుగోళ్ల వేగవంతానికి అధికారులు చర్యలు తీసుకున్నారు.

రెండు, మూడు రోజుల్లోనే చెల్లింపులు
ధాన్యం సేకరణకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియ ముగిసిన 21 రోజుల్లో సొమ్ములు రైతుల బ్యాంకు ఖాతాలకు జమచేస్తారు. కొన్నిసార్లు సాంకేతిక సమస్యలు, ఆన్‌లైన్ జాప్యంతో సకాలంలో సొమ్ములు అందక రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఈ సమస్య పరిష్కారానికి ఈ–క్రాప్ డేటా ఆధారంగా ఆధార్ ఎనేబిల్డ్ పేమెంట్ సిస్టమ్‌ను ప్రభుత్వం తీసుకువచ్చింది. ధాన్యం సేకరణను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయడం ద్వారా నిర్ణీత సమయానికి కంటే ముందుగానే రైతుల బ్యాంకు ఖాతాలకు ధాన్యం సొమ్ములు జమవుతున్నాయి. జిల్లాలో 24,722 మంది రైతుల నుంచి రూ.368.66 కోట్ల విలువైన ధాన్యం సేకరించగా ఇప్పటికే 17,670 మంది ఖాతాలకు రూ.263.87 కోట్లను ప్రభుత్వం జమచేసింది. రెండు, మూడు రోజుల నుంచి వారంలోపే రైతుల ఖాతాలకు సొమ్ములు జమవుతున్నాయి. ఈ విధానంతో దళారుల దోపిడీకి అడ్డుకట్ట పడటంతో పాటు మూడు వారాల గడువుకంటే ముందుగానే తమ చేతికి ధాన్యం సొమ్ములు అందుతున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పటిష్టంగా ధాన్యం సేకరణ
రైతులకు అన్నివిధాలా మేలు చేసేలా పటిష్టంగా ధాన్యం సేకరణ చేస్తున్నాం. 4.21 లక్షల టన్నులకు గాను ఇప్పటివరకు 1.69 లక్షల టన్నుల ధాన్యం సేకరించాం. ఆన్‌లైన్ ద్వారా రెండు, మూడు రోజుల నుంచి వారంలోపు ధాన్యం సొమ్ములు రైతుల ఖాతాలకు జమవుతున్నాయి. రైతులకు ధాన్యానికి సంబంధించి రూ.368.66 కోట్లకు గాను ఇప్పటికే రూ.263.87 కోట్ల చెల్లింపులు జరిగిపోయాయి.
– టి.శివరామప్రసాద్, డీఎం, సివిల్ సప్లయిస్, పశ్చిమగోదావరి జిల్లా

రూ.3.20 లక్షలు జమయ్యాయి



నేను 18 ఎకరాల్లో వరిసాగు చేశాను. 450 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. తుపానుకు ముందు, తర్వాత రెండు దఫాలుగా ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా మిల్లులకు తరలించాం. అమ్మిన మూడు రోజుల్లోనే ధాన్యం సొమ్ములు రూ.3.20 లక్షలు నా బ్యాంకు ఖాతాకు జమయ్యాయి.
– దాసరి వెంకటసత్యనారాయణ, వేంపాడు, కాళ్ల మండలం

మూడు రోజుల్లోనే డబ్బులు



నేను నాలుగు ఎకరాలు సాగు చేస్తున్నా. 1.5 ఎకరంలో కోత కోసి రైతు భరోసా కేంద్రం ద్వారా ధాన్యం విక్రయించా. మూడు రోజుల్లోనే ధాన్యం సొమ్ములు రూ.75,800 నా ఖాతాకు జమకావడం ఆనందంగా ఉంది. గతంలో కన్నా ధాన్యం సేకరణ విధానం చాలా మెరుగ్గా ఉంది.
– కౌరు శ్రీనివాస్, రాయకుదురు, వీరవాసరం మండలం

'లా నేస్తం'తో ప్రోత్సాహం



లా నేస్తం లబ్ధిదారులతో జాయింట్ కలెక్టర్

భీమవరం: కొత్తగా న్యాయవాద వృత్తిని చేపట్టిన జూనియర్ లాయర్లకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'వైఎస్ఆర్ లా నేస్తం' పథకం ఆర్థిక చేయూతతో పాటు వృత్తిలో ప్రోత్సాహాన్నిస్తోందని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. 2023–24కి రెండో విడత లా నేస్తం పథకాన్ని తాడేపల్లి నుంచి సీఎం జగన్ మీట నొక్కి ప్రారంభించగా.. భీమవరం కలెక్టరేట్ నుంచి జేసీ, అధికారులు వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ లానేస్తం పథకం ద్వారా మూడేళ్లగా 192 మందికి ప్రయోజనం చేకూరిందన్నారు. ఈ ఏడాది జూలై–డిసెంబర్ కాలానికి 192 మందికి రూ.30 వేల చొప్పున రూ.57.60 లక్షలను వారి ఖాతాల్లో జమచేసినట్టు చెప్పారు. జిల్లా వార్డు, గ్రామ సచివాలయాలు అధికారి కేసీహెచ్ అప్పారావు, న్యాయవాదులు కె.సుస్మిత షాలోమ్, కామాక్షి రవి సిన్హా, యువ న్యాయవాదులు పాల్గొన్నారు.

త్వరితగతిన పంట నష్టాల అంచనా
భీమవరం(ప్రకాశం చౌక్): తుపాను కారణంగా వాటిల్లిన పంట నష్టాలను త్వరితగతిన అంచనా వేసి ఈనెల 26లోపు సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. నష్టాల అంచనాకు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కమిటీలను వేయలన్నారు. ఈనెల 18లోపు నష్టం అంచనాలు రూపొందించి ఈనెల 22లోపు ఆర్‌బీకేలలో జాబితాలను ప్రదర్శించాలన్నారు. తద్వారా రైతుల అభ్యంతరాలు నమోదు చేయాలన్నారు. ఈనెల 26లోపు కలెక్టరేట్‌కు నష్టం అంచనాలు అందజేయాలని జేసీ ఆదేశించారు.

'ఉన్నతి–మహిళాశక్తి'తో సాధికారత

జేసీ రామసుందర్‌రెడ్డి



మహిళలకు ఆటోలు అందిస్తున్న జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): ఉన్నతి–మహిళాశక్తితో సాధికారత, ఎస్సీ, ఎస్టీ మహిళల జీవనోపాధికి మరింత ఊతం లభిస్తుందని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లాకు చెందిన ఆరుగురు ఎస్సీ, ఎస్టీ మహిళలకు సున్నావడ్డీకే ఆటోలు అందజేసి, వాటిలో కొంత దూరం ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఉన్నతి–మహిళాశక్తి పథకం ద్వారా సున్నా వడ్డీకే ఆటోలు అందిస్తోందన్నారు. లబ్ధిదారులపై భారం లేకుండా సులభవాయిదాల్లో రుణాలు చెల్లించి, వారి కుటుంబాలను పోషించుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆటో కొనుగోలు సమయంలో లబ్ధిదారులు 10 శాతం వాటాధనాన్ని ఖాతాలో జమచేస్తే మిగిలిన 90 శాతం వడ్డీలేని రుణంగా అందిస్తారన్నారు. జిల్లాలో ఆరుగురు లబ్ధిదారులకు రూ.18.52 లక్షల విలువైన ఆటోలను మంజూరు చేసి ఈ మేరకు వడ్డీలేని రుణ సదుపాయం కల్పించామన్నారు. ఈ ఆటోల్లో మహిళలు, పిల్లలు ధైర్యంగా ప్రయాణించే అవకాశం ఉంటుందన్నారు. ఆటోలు తీసుకొనే మహిళలకు డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పిస్తామని, డీఆర్‌డీఏ, రవాణాశాఖ అధికారులు సహకారం అందిస్తారన్నారు. కాలుష్య నియంత్రణ దృష్ట్యా సీఎన్‌జీ ఆటోలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన మహిళలు స్వయం సహాయ సంఘాల సభ్యులై వయస్సు 20 నుంచి 45 ఏళ్లలోపు గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు అర్హులన్నారు. మరింత మంది ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వార్డు, గ్రామ సచివాలయాలు అధికారి కేసీహెచ్ అప్పారావు, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ వైఎస్ఎస్ ప్రసాద్‌యాదవ్, డీపీఎం కె.శ్రీనివాస్, ఐబీ డి.వెంకటేశ్వరరావు, జిల్లా ఉన్నతి కో–ఆర్డినేటర్ బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల ఎంపికలో అలసత్వం సహించం

భీమవరం: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి క్రీడాకారుల ఎంపికలో అలసత్వం సహించమని జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో ఆడుదాం ఆంధ్రపై డివిజన్, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు మున్సిపాల్టీలు, వీరవాసరం, ఇరగవరం మండలాల్లో క్రీడాకారుల ఎంపిక ఎందుకు పూర్తికాలేదని అధికారులను ప్రశ్నించారు. మంగళవారం నాటికి పనులన్నీ పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని సమష్టిగా విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఆటలకు ప్రతి సచివాలయం పరిధిలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా రెండు బృందాలు ఏర్పాటుచేయాలన్నారు. క్రీడా కిట్లను అన్ని సచివాలయాలకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆటలకు ఇబ్బంది లేకుండా మైదానాలను సిద్ధం చేయాలన్నారు. డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి కె.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం



దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు



పూజలు చేస్తున్న దృశ్యం

భీమవరం: రాష్ట్ర దేవదాయశాఖ, ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్దరాజు ఆనంద రాజు ఫౌండేషన్ సహకారంతో సోమవారం భీమవరంలోని ఆనంద్‌ఇన్ ఆవరణలో నిర్వహించిన మహా రుద్రాభిషేకం, స్వామి కల్యాణం, లక్ష దీపోత్సవాలు వైభవంగా జరిగాయి. ముందుగా జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. ఆనంద ఇన్ ఫంక్షన్ హాల్‌లో ఆధ్యాత్మికవేత్త కంభంపాటి సుబ్రహ్మణ్యం కార్తీకమాస విశిష్టతను వివరించగా.. మావుళ్లమ్మ దేవస్థానం ఆస్థాన పండితుడు ఈమని రామచంద్ర ఘనాపాటి, వేదపండితులు వారణాసి లక్ష్మీనర్సింహస్వామి పురోహితుల బృందాలతో జల, పుష్ప, రుద్రాభిషేకాలు, శివపార్వతుల కల్యాణం, లక్ష దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, మావుళ్లమ్మ, సోమేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానాల ఈఓలు యర్రంశెట్టి భద్రాజీ, రామకృష్ణంరాజు, దండు కృష్ణంరాజు, నిర్వహణ కమిటీ సభ్యులు ఉద్దరాజు రామకృష్ణంరాజు, మంతెన రామ్‌కుమార్‌రాజు, కంతేటి వెంకట్రాజు, డీవీఎస్ చంద్రాజీ పాల్గొన్నారు.

15 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఈనెల 15 నుంచి నిర్వహించే ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొనే వారి రిజిస్ట్రేషన్ ప్రక్రియను మంగళవారంలోపు పూర్తిచేయాలని ఏలూరు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. సోమవారం ఏలూరు కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు.

పంచారామం.. భక్తి పరవశం



పాలకొల్లులో క్షీరారామలింగేశ్వరునికి అభిషేకాలు



భీమవరంలో ఉమాసోమేశ్వరస్వామికి అభిషేకాలు



పట్టిసం వీరేశ్వరస్వామికి పూజలు



పట్టిసంలో ఇసుకతిన్నెలపై క్యూ కట్టిన భక్తులు



పాలకొల్లు క్షీరారామంలో క్యూలైన్లలో భక్తులు

పాలకొల్లు సెంట్రల్/భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని పంచారామక్షేత్రాలు శివనామస్మరణలతో మార్మోగాయి. కార్తీకమాసం ఆఖరి సోమవారం కావడంతో పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం (క్షీరారామం), భీమవరం గునుపూడిలోని ఉమాసోమేశ్వర జనార్దన స్వామి ఆలయం (సోమారామం)కు భక్తులు పోటెత్తారు. పాలకొల్లులో మహన్యాస పూర్వక అభిషేకాలు చేయించుకునే భక్తులతో ఆలయ వెనుక భాగం, అభిషేకాల మండపం నిండిపోయాయి. గోశాల వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి పంచారామ యాత్రికులతో ఆలయం మరింత కిటకిటలాడింది. సుమారు 40 వేల మంది భక్తులు స్వామిని దర్శించినట్టు అంచనా. స్థానిక రేపాక వారి సత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. క్షీరారామలింగేశ్వస్వామి సేవా సమితి సభ్యులు ఉచిత పాలు, ప్రసాదం పంపిణీ చేశారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈఓ యాళ్ల సూర్యనారాయణ, పట్టణ సీఐ డి.రాంబాబు, ఎస్సైలు ఎస్.ముత్యాలరావు, బి.శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సోమారామంలో ప్రత్యేక అభిషేకాలు
భీమవరం గునుపూడిలోని ఉమాసోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానానికి వేకువజాము నుంచి భక్తుల రాక మొదలైంది. స్వామివారికి నిర్విరామంగా ప్రత్యేక అభిషేకాలు చేశారు. ప్రధాన అర్చకులు కందుకూరి సోంబాబు, చేకూరి రామకృష్ణ, అర్చకుల బృందం ఆధ్వర్యంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, పంచమృతాభిషేకాలు జరిగాయి. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక నోములు నోచుకున్నారు. అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. దేవస్థానం ఈఓ డి.రామకృష్ణరాజు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పట్టిసం.. భక్తజన సంద్రం
పోలవరం రూరల్: పట్టిసం శివక్షేత్రంలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి భక్తుల రద్దీ కనిపించింది. ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. శివకేశవులకు నిలయమైన ఈ క్షేత్రంలోని భావన నారాయణస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. క్షేత్రానికి వచ్చిన భక్తులు గోదావరి దాటేందుకు లాంచీలు ఎక్కి, దిగేందుకు వీలుగా క్యూలైన్ల వద్ద పోలవరం ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. మాసశివరాత్రి సందర్భంగా హుకుంపేట జమీందారు హోతా కుటుంబీకుల ఆధ్వర్యంలో లక్షపత్రి పూజ చేశారు. ఆలయ ఈఓ ఎస్.సంగమేశ్వరశర్మ భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. శివక్షేత్రం రేవులో భక్తులకు సొసైటీ అధ్యక్షుడు పాదం రాజబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు తెలగంశెట్టి సూర్యచంద్రం మజ్జిగ పంపిణీ చేశారు.

క్లుప్తంగా

మలేషియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 'విష్ణు' విద్యార్థినికి కాంస్యం


పిల్లి వందన

భీమవరం: మలేషియాలో సోమ వారం నిర్వహించిన ఏషియా క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో 84 కిలోల సబ్ జూనియర్ విభాగంలో స్థానిక విష్ణు ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని పిల్లి వందన తృతీయస్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. వెయిట్ లిఫ్టింగ్‌తోపాటు వందన స్క్వాట్‌లో వెండి పతకం, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్‌లో కాంస్య పతకం సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మెడల్స్ గెలిచిన వందనను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరాజు తదితరులు అభినందించారు.

ముగిసిన వాలీబాల్ ఇన్విటేషన్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్స్: సూరెడ్డి సత్యనారాయణ (నల్లబాబు) మెమోరియల్ వాలీబాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. టోర్నమెంట్ విజేతగా విశాఖపట్నం జట్టు నిలిచింది. మహాత్మ కల్చరల్ ఫ్రెండ్స్ (ఎంసీఎఫ్) అసోసియేషన్ ఆధ్వర్యాన విజయవాడ పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఈ నెల 8వ తేదీన ప్రారంభమైన ఈ పోటీలకు విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా (ఎంసీఎఫ్), ప్రకాశం జిల్లాల జట్లు ప్రాతినిధ్యం వహించాయి. విజేత జట్టు విశాఖపట్నం టోర్నీ ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించింది. ఆదివారం రాత్రి హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో కృష్ణా (ఎంసీఎఫ్) జట్టును ఓడించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో కృష్ణా జట్టు నిలిచింది. ప్రకాశం జట్టు మూడో స్థానాన్ని, తూర్పు గోదావరి జట్టు నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాయి. అర్జున, ద్రోణాచార్య అవార్డుల గ్రహీత ఎ.రమణరావు, ఉయ్యూరు మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), సిద్ధార్థ అకాడమి కోశాధికారి సూరెడ్డి సత్యనారాయణ విజేతలకు ట్రోఫీలు అందజేశారు. వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.బ్రహ్మాజీ, దయాకరరావు టోర్నీని పర్యవేక్షించారు.

పెళ్లింట పెను విపత్తు


గల్లంతైన గాయత్రీ, లక్ష్మీనారాయణ (ఫైల్)


అంతర్వేది బీచ్‌లో ఎదురు చూస్తున్న బంధువులు

- అంతర్వేది బీచ్‌లో స్నానానికి దిగి గల్లంతైన నవ వధూవరులు
- గుర్వాయిపాలెంలోని వధువు, కాళ్లకూరులోని వరుడి ఇళ్లలో కన్నీరుమున్నీరవుతున్న బంధువులు
- కొత్త దంపతుల జాడ కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు


కలిదిండి/కైకలూరు/కాళ్ల: అగ్నిసాక్షిగా ఏడడుగులు వేసి ముచ్చటగా రెండు మాసాలు గడవలేదు. పెళ్లి పందిరి తోరణాలు కూడా వాడలేదు. అంతలోనే నవవధూవరులు సముద్ర స్నానానికి వెళ్లి గల్లంతయ్యారు. స్వామివారిని దర్శించుకుని తిరిగి ఇంటికి వస్తారని ఎదురుచూసిన కుటుంబ సభ్యులకు నూతన జంట గల్లంతయ్యారనే సమాచారం తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా అంతర్వేది బీచ్‌లో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఈ ఘటనతో వధూవరుల ఇళ్లు శోకసంద్రంలో మునిగిపోయాయి. ఏలూరు జిల్లా కలిదిండి మండలం గుర్వాయిపాలెం గ్రామానికి చెందిన అంబటి పరుశురామయ్య, ఉదయలక్ష్మీ మొదటి కుమార్తె గాయత్రీ (21)ని పశ్చిమగోదావరి జిల్లా జువ్వాలపాలెంకు చెందిన రేలంగి బసవలింగం, జయలక్ష్మీ కుమారుడు లక్ష్మీనారాయణ (26)తో నవంబర్ 1న కైకలూరు నియోజకవర్గం సింగరాయపాలెం గుడిలో ఘనంగా వివాహం జరిపించారు. లక్ష్మీనారాయణ బీటెక్, బీఈడీ చేసి భీమవరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. కార్తీకమాసం చివరి ఆదివారం కావడంతో కొత్త దంపతులు లక్ష్మీనారాయణ, గాయత్రీ ద్విచక్రవాహనంపై మధ్యాహ్నం 3 గంటలకు అంతర్వేది దేవాలయాన్ని దర్శించుకుని నాలుగు గంటలకు బీచ్‌కు వెళ్లారు. బంధువులతో కలిసి కాకుండా వాహనంపై బీచ్‌లో దూరంగా వెళ్లారు. అక్కడ వాహనం, సెల్‌ఫోన్లు ఉంచి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. తరువాత కొద్ది సమయానికే వీరు కనిపించలేదు. సెల్‌ఫోను ఆధారంగా బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. సఖినేటిపల్లి పోలీస్ స్టేషన్‌లో వరుడి తండ్రి బసవలింగం ఫిర్యాదు మేరకు పోలీసులు, మెరైన్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం సాయంత్రం వరకు వారి జాడ లేదు.

● శివోహం


పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ ఆలయం వద్ద కార్తీకమాసం సందర్భంగా సోమవారం రాత్రి అమ్మవారికి కార్తీక దీపోత్సవం నిర్వహించారు. శివాకృతిలో 365 ఒత్తులతో లలిత పారాయణ బృంద సభ్యులు ఆలయం చుట్టూ దీపాలు వెలిగించారు. – తాడేపల్లిగూడెం (టీఓసీ)

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాల పంట

- తిరుపతిలో మాస్టర్స్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు
- 40 పతకాలు సాధించిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



రాష్ట్ర స్థాయి మాస్టర్స్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

ఏలూరు రూరల్: రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాస్టర్స్ పతకాల పంట పండించారు. 30 ఏళ్ల వయస్సు విభాగం నుంచి 70 ప్లస్ వయస్సు వరకూ పోటీ పడి ప్రత్యర్థులను చిత్తు చేసి 40 మెడల్స్ చేజిక్కించుకున్నారు. ఇందులో 20 గోల్డ్ మెడల్స్, 16 సిల్వర్, మరో 4 బ్రాంజ్ మెడల్స్ ఉన్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బీడీ నాగేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 8వ తేదీ నుంచి 10 వరకూ చిత్తూరు జిల్లా తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీతో పాటు తారకరామ స్టేడియంలో రాష్ట్ర స్థాయి 42వ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న 75 ప్లస్ వయస్సు విభాగంలో ఎం.నరసింహరాజు 100, 200, 400, 4 × 400 మీటర్ల పరుగు పందెంలో 4 గోల్డ్ మెడల్స్, 4 × 100 పరుగు పోటీలో ఒక సిల్వర్ మెడల్ సాధించాడు. ఇదే విభాగంలో ఇంటి కృష్ణమోహనరావు హైజంప్‌లో గోల్డ్, 100, 800 మీటర్ల పరుగులో సిల్వర్, బ్రాంజ్ గెలుపొందారు. 70 ప్లస్‌లో ఎం.యోహాన్ షాట్‌పుట్, హెమర్‌త్రోలో 2 బ్రాంజ్‌మెడల్స్ చేజిక్కించుకున్నారు. 65 ప్లస్‌లో బీడీ నాగేశ్వరరావు హేమర్‌త్రో అంశంలో సిల్వర్ మెడల్ సాధించారు. 60 ఏళ్ల విభాగంలో సుంకర యాకోబు 800, 1400, 4 × 400, మూడు బంగారు పతకాలు, 5 కి.మీ పరుగు, 4 × 100 మీటర్ల పరుగులో 2 సిల్వర్ మెడల్స్ సాధించారు. మహిళలు 70 ప్లస్ విభాగంలో కె.శాంత కుమారి షాట్‌పుట్, డిస్కస్, జావలిన్‌త్రోలో 3 సిల్వర్ మెడల్స్ సాధించారు. మరోపక్క పి.పద్మ జయలక్ష్మీ 40 ప్లస్ విభాగంలో పోటీపడి 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, హైజంప్‌లో 3 బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. ఇదే క్రమంలో పి.రమేష్‌రాజు, పి.సుబ్బరాజు, జె.గోపాలకృష్ణ, వి.సుబ్బరాజు, వై.అశోక్‌కుమార్, ఎస్.సూర్యనారాయణ పలు విభాగాల్లో పోటీ పడి పతకాలు సాధించారని వివరించారు.

అథ్లెటిక్స్‌లో మండపాక పీడీకి మూడు బంగారు పతకాలు


బంగారు పతకాలతో పీడీ సూర్యనారాయణ

తణుకు అర్బన్: మండపాక జెడ్పీ హైస్కూల్ పీడీ సంకు సూర్యనారాయణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన 42వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 5 వేల మీటర్లు, 1500 మీటర్లు, 5 కిలో మీటర్లు వాకింగ్ పోటీల్లో పాల్గొని మూడు విభాగాల్లోనూ బంగారు పతకాలు సాధించినట్లు సూర్యనారాయణ సోమవారం స్థానిక విలేకరులకు చెప్పారు. ఈ విజయాలతో వచ్చే ఏడాది జనవరిలో పూణేలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి


భీమవరం స్పందనలో ఓ మహిళ సమస్యను వింటున్న ఎస్పీ రవిప్రకాష్


ఓ మహిళ సమస్య వింటున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

భీమవరం: భీమవరం డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మొత్తం 13 ఫిర్యాదులు అందాయని ఎస్పీ యు.రవి ప్రకాష్ చెప్పారు. ఈ ఫిర్యాదుల్లో ఎక్కువగా వరకట్న వేధింపులు, సరిహద్దుల గొడవలు, సివిల్ వివాదలకు సంబంధించినవి ఉన్నాయన్నారు. ఫిర్యాదులపై సత్వరమే చట్ట ప్రకారం విచారణ చేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఫోన్‌లో ఆదేశించారు. స్పందనలో అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు కూడా ఫిర్యాదులు స్వీకరించారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో ఆయా సమస్యలపై స్పందనలో ఫిర్యాదులు, వినతులు సమర్పించిన బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఏలూరు ఎస్పీ డీ.మేరీప్రశాంతి ఆదేశించారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆమె స్పందనలో ప్రజల నుంచి వినతులను స్వీకరించి సంబంధిత పోలీస్ అధికారులకు సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసిన నేపథ్యంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పే మోసగాళ్ల మాటలు నమ్మవద్దని కోరారు. ప్రతిభతో ఉద్యోగాలు సాధించాలని, అడ్డదారుల్లో వెళితే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తేనే ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు.

వినతుల్లో కొన్ని..

తన భర్త ముందే వేరొక మహిళతో వివాహం అయిందని, తనను మోసం చేసి పెళ్లి చేసుకున్నాడని, తనను తరచూ వేధింపులకు గురిచేస్తున్నాడని కలిదిండి నుంచి వచ్చిన ఓ మహిళ ఎస్పీకి మొరపెట్టుకుంది. ఇళ్ళ స్థలాలు ఇప్పిస్తానని చెప్పి గ్రామ సర్పంచ్ ఒక్కొక్కరు నుంచి రూ.20 వేలు తీసుకుని మోసం చేశారని, అతనిపై చర్యలు తీసుకోవాలని పెదనింద్రకొలను మహిళలు ఎస్పీని కోరారు. కళాశాలకు వెళ్లి చదువుకుంటున్న తన కుమార్తెకు ఓ వ్యక్తి మత్తు పదార్థాలు, మద్యం అలవాటు చేసి సన్నిహితంగా ఉన్న సమయంలో ఫొటోలు తీసి సోషల్ మీడియా ప్రచారం చేస్తూ వేధిస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఉంగుటూరు మండలానికి చెందిన ఓ తల్లి అర్జీ అందించింది. తనకుమారుడు మరణించడంతో తన కోడలు ఇంటిని ఆక్రమించుకోవాలనే ఉద్దేశంతో తనను ఇబ్బందులకు గురిచేస్తోందని, విచారణ చేసి న్యాయం చేయాలని జీలుగుమిల్లి మండలం ములగలంపల్లికి చెందిన ఓ వృద్ధుడు అర్జీ అందించారు.

13న త్రోబాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వైఎస్సార్ అండ్ బీఎస్‌జేవీఆర్ జూనియర్ కళాశాలలో ఈ నెల 13న త్రోబాల్ జూనియర్స్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్ఏఆర్‌కే వర్మ, సెక్రటరీ ఎస్.ఎం.శ్రీనాథ్ సోమవారం చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు బుధవారం ఉదయం 9 గంటలకు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, పుట్టిన తేదీలకు సంబధించిన ఒరిజినల్, జిరాక్స్ పత్రాలను, ఎనిమిది పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు వెంట తీసుకురావాలన్నారు. ఎంపిక పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులను ఈ నెల 16, 17 తేదీలలో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

కళాశాల బస్సు ఢీకొని గేదెల కాపరి దుర్మరణం


బుంగా రామకృష్ణ (ఫైల్)

అత్తిలి: గేదెలను మేత కోసం తోలుకునివెళుతుండగా ప్రైవేట్ కళాశాల బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో ఓ కాపరి అక్కడికక్కడే మృతి చెందాడు. అత్తిలి ఎస్సై వి.రాంబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అత్తిలి మండలం కె.సముద్రపుగట్టు గ్రామానికి చెందిన బుంగా రామకృష్ణ (35) సోమవారం ఉదయం తణుకు వైపునకు గేదెలను మేత కోసం తోలువెళుతుండగా, అత్తిలి నుంచి తణుకు వెళుతున్న కళాశాల బస్సు అతివేగంగా వెనుక నుంచి రామకృష్ణను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఘటనా స్థలంలోనే రామకృష్ణ మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని సోదరుడు బుంగా సూర్యప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

చేలల్లో ముంపు నీరు త్వరగా తొలగించండి

ఉండి: మిరప, టమాటా, వంగ తోటల్లో నిలిచిన వర్షపు నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు మళ్లించాలని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు రైతులకు సూచించారు. తుపాను కారణంగా ముంపునకు గురైన మిరప, టమాటా, వంగ తదితర పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వివరించారు. పొలాల్లో నిలిచిన నీటిని బయటకు మళ్లించిన అనంతరం 19:19:19 లేదా 30:0:45 లేదా యూరియా వంటి పోషకాలను పంటపై చల్లుకోవాలి. పంటలో కలుపును తొలగించి నేల త్వరగా ఆరేటట్లు చేసుకోవాలి. నీరు ఎక్కువ సమయం నిల్వ ఉండటం వల్ల ఎండు తెగులు ఆశించే అవకాశం ఉందని, దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాముల మందును లీటరు నీటికి లేదా మెటలాక్సీర్, మాంకోజెబ్ 2 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి మొక్కల మొదట్లో పోయాలి. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడం వలన ఆకుమచ్చ తెగులు, బూజు తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు కార్బండిజం 1 గ్రాము మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అలాగే అరటి పంటకు సిగటోకా ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ. మందును నీటికి జిగురుతో కలిపి పిచికారీ చేయాలి. భూమిలో అధిక తేమ వలన అరటి దుంపలు కుళ్లిపోయే అవకాశం ఉన్నందున కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా లేదా 1 శాతం బోర్డో మిశ్రమం దుంప చుట్టూ తడిచేలా పోయాలి. అదేవిధంగా బొప్పాయిలో మొక్కలు పసుపు రంగులోకి మారడం, కాండం కుళ్లు వంటి లక్షణాలు ఉన్నట్లయితే 2.గ్రా.లీ. లేదా ఎలైట్ 2.గ్రా.లీ. కలిపి మొక్క మొదళ్లలో పోయాలి. అధిక వర్షపాతం తరువాత పండుఈగ ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున మిథైల్‌యూజినాల్ ఎరలను ఎకరాకు 10 నుంచి 15 ఏర్పాటు చేసుకోవాలి.

క్లుప్తంగా

శిల్పాశ్రమంలో కార్తీక వన సమారాధన



కార్తీక వన సమారాధనలో కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): శిల్పాశ్రమంలో సోమవారం కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. రంగస్థల కళాకారులు, హరికథ, బుర్రకథ కళాకారులు విచ్చేశారు. తొలుత దామోదర పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కార్తీక మాసం సందర్భంగా సహపంక్తి భోజనాలు చేశారు. కళాకారులను సత్కరించారు. ఘంటసాల గానసభ అధ్యక్షుడు కాసిం, మానస ప్రింటర్స్ అధినేత వెంకన్న, విశ్రాంత ఎంఈఓ అత్తిలి సుబ్బారావు, అత్తిలి శ్రీనివాస్, కోట రాంబాబు, వంశీ కృష్ణ, మురళీకృష్ణ, బాబూరావు, వనచర్ల నాగేంద్ర ప్రసాద్, ఇసరపు లక్ష్మి, అంజలి, లలిత, భానుమతి, రమణ, రజిని, ప్రసన్న కుమార్ తదితరులు హాజరైయారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న దృశ్యం

పెంటపాడు: కార్తికమాసం మాస శివారాత్రి, సందర్భంగా పెంటపాడు పార్వతి రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో తెల్లవారు జాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో ఈ పూజలు ఘనంగా నిర్వహించారు. వినాయకుని పూజ, ఏకాదశ రుద్రాభిషేకం, లక్షపత్రి పూజ, లక్ష కుంకుమార్చన, జ్యోతిర్లింగార్చన, మహారుద్ర హోమం పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

డైమండ్స్ సేవలు అభినందనీయం



అయ్యప్ప ఆలయం వద్ద ప్రసాద వితరణలో డైమండ్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం డైమండ్స్ దైవిక కార్యక్రమాలు అభినందనీయమని క్లబ్ జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్నారు. దైవిక సామాజిక సేవల్లో భాగంగా కార్తీక సోమవారం సందర్భంగా అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య, బోళ్ల రాము, కె.వెంకటేశ్వర రావు, జామి సత్యనారాయణ, యర్రా ఆంజనేయస్వామి, కె.సాయి సత్యనారాయణ రాజు, వెంకట్రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉమాసిద్ధేశ్వరునికి అభిషేకాలు



అత్తిలిలో ఉమాసిద్ధేశ్వరునికి అభిషేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: కార్తీకమాసం ఆఖరి సోమవారం సందర్భంగా మండలంలో శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. వేకువజాము నుంచే భక్తులు శివాలయాలకు చేరుకుని అభిషేక పూజలు జరిపారు. అత్తిలిలో గల శ్రీఉమాసిద్ధేశ్వరస్వామికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఐలూరి రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

బాడీబిల్డింగ్ విజేతలకు బహుమతులు

భీమవరం: బాడీబిల్డింగ్ ద్వారా దేహదారుఢ్యం తోపాటు వివిధ రంగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయని, యువకులకు క్రీడా నైపుణ్యం తప్పనిసరని డీసీసీబీ చైర్మన్, యూత్ క్లబ్ అధ్యక్షుడు పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. స్థానిక గోవర్ధన్ ఫిట్‌జోన్ జిమ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి యూత్ క్లబ్‌లో నిర్వహించిన గోదావరి జోన్ బాడీబిల్డింగ్ పోటీలో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పీవీఎల్ మాట్లాడారు. పోటీల నిర్వాహకుడు ఎస్ గోవర్ధన్ మాట్లాడుతూ 14 విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందించామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గ్రంధి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ ఆపద్బాంధవుడు జగన్

నందడిగా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



అత్తిలి: వరిఘేడులో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ



తణుకు టౌన్: మాట్లాడుతున్న పట్టణ సచివాలయాల కన్వీనర్ ఇందుగపల్లి బలరామకృష్ణ



తాడేపల్లిగూడెం అర్బన్: 17వ వార్డులో సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తాడేపల్లిగూడెం రూరల్: నందమూరులో మాట్లాడుతున్న యువనేత కొట్టు విశాల్

అత్తిలి: సంక్షేమ పథకాలు అమలు చేసి ముఖ్యమంత్రి ప్రతి కుటుంబానికి అపద్బాంధవుడిగా నిలిచారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడ పైబోయిన సత్యనారాయణ అన్నారు. అత్తిలి మండలం వరిఘేడు గ్రామంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా పైబోయిన మాట్లాడుతూ పేద వర్గాలకు పారదర్శకంగా సంక్షేమం అందాలంటే సీఎంగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి విద్యాదీవెన, విద్యాకానుక, అమ్మ ఒడి, మనబడి నాడు–నేడు వంటి పథకాలను ప్రవేశపెట్టి అందరి మన్ననలు పొందారని తెలిపారు. టీడీపీ, జనసేన పార్టీలవారు కల్లబొల్లి మాటలు చెబుతూ మీ ఇళ్లకు వస్తున్నారని, మీ కుటుంబ వివరాల డేటాను చోరీ చేసేందుకు చూస్తున్నారని జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి సుపరిపాలన అందించే సీఎంను రానున్న ఎన్నికల్లో తిరిగి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ముందుగా పార్టీ పతాకాన్ని పైబోయిన సత్యనారాయణ ఎగురవేసారు. అనంతరం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అడ్డాల రమేష్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు అనిశెట్టి త్రిమూర్తులు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రంభ సూరిబాబు, చిటకన వెంకట్రావు, ఆర్ శాంతకుమారి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

తణుకు టౌన్: రాష్ట్రంలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తణుకు పట్టణ సచివాలయాల కన్వీనర్ ఇందుగపల్లి బలరామకృష్ణ చెప్పారు. సోమవారం సాయంత్రం తణుకు పట్టణం పైడిపర్రు 30వ సచివాలయం వద్ద నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలని అనే అంశంపై ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమానికి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మంగెన సూర్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ మాట్లాడుతూ తణుకు పట్టణంలోని 30వ సచివాలయం పరిధిలో ప్రభుత్వం రూ. 15 కోట్ల 83 లక్షల విలువైన సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. అదే విధంగా పట్టణంలోని పేదలకు 145 ఎకరాలను సేకరించి ఇళ్ల స్థలాలు అందించి పేదల సొంతింటి కలను నిజం చేశారన్నారు. రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పేదల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో పేద పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పథకం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ములగాల శ్రీనివాసు, పట్టణ వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు గుబ్బల సూర్యచంద్రరావు, నాయకులు కే విశ్వేశ్వరరావు, రేలంగి రాంబాబు, యరబాటి రామకృష్ణ, వార్డు కన్వీనర్లు త్రినాథ్, తిరుమల శ్రీనివాసు, ఉమ్మడి సింగ్ శ్రీను, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తాడేపల్లిగూడెం అర్బన్ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని 17వ వార్డు ఇన్‌చార్జ్ బొడ్డు సాయిబాబు తెలిపారు. సోమవారం 17వ వార్డులో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్ బొడ్డు సాయిబాబా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలందరూ ఆర్థిక పుష్టిని సాధించారన్నారు. అనంతరం వలంటీర్లకు మా నమ్మకం నువ్వే జగన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, బోణం విజయనిర్మల, దింటకుర్తి లీలావతి, మున్సిపల్ ఏఎస్ఓ సురేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పాలన

తాడేపల్లిగూడెం రూరల్: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు 600 హామీలు ఇచ్చాడని, ఏ ఒక్కటైనా అమలుచేశాడా ? అని యువనేత కొట్టు విశాల్ ప్రశ్నించారు. సోమవారం సాయంత్రం మండలంలోని నందమూరు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టు విశాల్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం పట్టణం చుట్టూ ఉన్న తాడేపల్లిగూడెం – నవాబుపాలెం, తాడేపల్లిగూడెం–బాదంపూడి రహదారులను త్వరలోనే పూర్తిచేయనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో సీఎం జగన్ ఎంతో పారదర్శకంగా పాలన అందిస్తున్నారన్నారు. గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నట్టు తెలిపారు. ఏనాడైనా చంద్రబాబు ఇంత అభివృద్ధి చేశాడా ? అని ప్రశ్నించారు. కల్లబొల్లి మాటలు చెప్పి తిరిగి అధికారంలోకి రావాలని చూస్తున్నారన్నారు. ఇంత అభివృద్ధి చేస్తున్న సీఎం జగన్‌ను, నియోజకవర్గంలో కొట్టు సత్యనారాయణను ప్రజలు గెలిపించుకోవాలన్నారు. తొలుత గ్రామానికి వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్‌లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, మాజీ సర్పంచ్‌లు కోనేటి దానయ్య, కల్లేపల్లి కృష్ణంరాజు, సరిపల్లి కృష్ణంరాజు, వీర్లపాటి సత్యనారాయణ, సచివాలయ కార్యదర్శి ఆకుల లక్ష్మీ మణికంఠేశ్వరి, మహ్మద్, అహ్మద్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

మాధవరంలో లక్ష దీపోత్సవం



ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న మహిళలు

తాడేపల్లిగూడెం రూరల్: కార్తీక సోమవారం సందర్భంగా సాయంత్రం మండలంలోని మాధవరం రామ తులసి కోట సెంటర్‌లోని శివాలయం వద్ద లక్ష దీపోత్సవం నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి మహిళలు తరలివచ్చి కార్తీక దీపాలనువెలిగించారు. భక్తులు పాల్గొన్నారు.

బలుసులమ్మ ఆలయంవద్ద కార్తీక దీపోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా రాత్రి బలుసులమ్మ ఆలయం వద్ద దేవస్థానం చైర్మన్ కొట్టు అంజిబాబు, సీజీఎఫ్ కమిటీ సభ్యులు కర్రి భాస్కర్‌రావు ఆధ్వర్యంలో అమ్మవారికి కార్తీక దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయం చుట్టూ అమ్మవారి సేవకులు, భక్తులు దీపాలు వెలగించారు. తొలుత ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు అప్పన రమేష్, వట్టిపోలు రాము, గుంటుబోయిన రామస్వామి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



కొట్టు విశాల్‌ను సన్మానిస్తున్న పెంటపాడు శెట్టిబలిజపేట వాసులు

పెంటపాడు: మండలంలోని శెట్టిబలిజపేట వాసులు ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ ఆలయంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యువనేత కొట్టు విశాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువనేత కొట్టు విశాల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అంజిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కర్రి వరహాల రెడ్డి, సలుమూరి ప్రకాష్ శెట్టిబలిజయూత్ సంఘ సభ్యులు, ఎస్సీపేట వాసులు తదితరులు పాల్గొన్నారు.

వేల్పూరు..

తణుకు టౌన్: కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో రుద్రేశ్వరస్వామి, వీరభద్రస్వామి, మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో సోమవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గూడెంలో ఘనంగా యూపీఎఫ్ ఐక్య క్రిస్మస్ వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న జైబాబు

పెంటపాడు: దేవుని ఆధ్యాత్మిక శక్తి ద్వారానే మానవునికి ఆత్మజ్ఞానం లభిస్తుందని యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు పేర్కొన్నారు. గూడెం భాగ్యలక్ష్మీపేటలోని ఎల్ఎల్ఎం చర్చిలో సోమవారం సుమారు 300 మంది సేవకుల సమక్షంలో 5 మండలాల ప్రాంతీయ యుపీఎఫ్ ఐక్యక్రిస్మస్ ఆరాదన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ గౌరవ అధ్యక్షుడు బిషప్ ఐజక్ ముగ్గళ్ల అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో జైబాబు మాట్లాడుతూ విశ్వాసులకు ఆత్మీయ జ్ఞానం అందించేందుకు సేవకులు ఐక్యంగా పాటు పడాలన్నారు. గత కొన్నేళ్లుగా ఐక్యక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్న సభ్యులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డేవిడ్ లివింగ్‌స్టన్, ఎస్. అబ్రహాం, కె. యెహెజ్కేల్, సీహెచ్ మనష్షే, రత్నరాజు, రాజ్‌కుమార్, సునీల్, రాజబాబు, కరుణాకర్, జాన్‌బాబు, సాల్మన్, జోసఫ్, ఇమ్మానియేలు తదితరులతో పాటు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ పీఎంవీకే జ్యోతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఎంఈఓ పీఎంవీకే జ్యోతి, ఐదో వార్డు ప్రజా ప్రతినిధి కాకర్ల శ్రీనులు అన్నారు. స్థానిక సుబ్బారావుపేటలోని భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దివ్యాంగులకు చక్కని చదువులు చదివించాలని సూచించారు. దివ్యాంగుల పిల్లల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సమగ్ర శిక్ష ద్వారా బధిర విద్యార్థులకు వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య, కట్ట సురేష్ కుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.జ్యోతి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

జాలి సుబ్బరావు కుటుంబానికి పరామర్శ



సుబ్బరావును పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఇరగవరం: మండలంలోని సూరంపూడి గ్రామానికి చెందిన మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు జాలి సుబ్బరావు భార్య వరలక్ష్మి సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు జాలి సుబ్బరావుకు ఫోన్ చేసి ప్రగాడ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు చోడే జోషి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, కోటి దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు

ఉండి: ఉండి – గణపవరం రోడ్డులోని పాతపెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి గణపవరం వైపు నుంచి ఉండి వస్తున్న లారీ అదుపుతప్పి కుడి వైపున రోడ్డు పక్కనే ఉన్న కొబ్బరి చెట్టును ఢీ కొట్టింది. దీంతో లారీ డ్రైవర్ కుడి కాలుకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు అతనిని 108 వాహనంలో భీమవరం తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వ్యక్తిని కొట్టిన ముగ్గురిపై కేసు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వ్యక్తి కొట్టిన ముగ్గురిపై ఎస్సై బి.మోహన్‌రావు కేసు నమోదు చేశారు. కొవ్వాడ అన్నవరం గ్రామానికి చెందిన రేవులగడ్డ రత్నంరాజును అదే గ్రామానికి చెందిన చిగురుపాటి ఏసురాజు, చిగురుపాటి యోహాన్, చిగురుపాటి జాన్ మోజేష్‌లు ఆదివారం రాత్రి కొట్టడంతో ఆస్పత్రి పాలయ్యాడని రేవుల గడ్డ రత్నంరాజు ఇచ్చిన ఫిర్యాదు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై పేర్కొన్నారు.

రక్త హీనతపై విద్యార్థులకు అవగాహన

తణుకు టౌన్: విద్యార్థుల్లో రక్తహీనతపై అవగాహన అవసరమని తణుకు శ్రీచిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆర్‌కే ఫణిధర్ చెప్పారు. సోమవారం తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో అనీమియా అవగాహనా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో జంతు శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ కే నాగభూషణ్ రెడ్డి మాట్లాడుతూ మనుషుల్లో తగినంత రక్తం అవసరమని చెప్పారు. మగవారిలో 5 లీటర్లు, మహిళల్లో 6 లీటర్ల రక్తం అవసరమన్నారు. మగవారిలో 14 నుంచి 18 ఎంఎల్, ఆడవారిలో 12 నుంచి 16 శాతం హిమోగ్లోబిన్ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జీ విజయకుమార్, మహిళాసాధికార కన్వీనర్ ఏ మారుతీదేవి చౌదరి, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఐవీ నారాయణ, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ముమ్మరంగా దాళ్వా వరి నాట్లు



తాడేపల్లిగూడెం మండలం మోదుగ గుంటలో నాట్లు వేసేందుకు సిద్ధమైన నారుమడి



గొల్లగూడెం గ్రామంలో నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో దాళ్వా వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ముందుగానే ఖరీఫ్ సీజన్ పూర్తి కావడంతో గత నెలలో నారుమడి పోశారు. 21 రోజులు పూర్తి కావడంతో నాట్లు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం మోదుగ గుంట, ఎల్. అగ్రహారం, మెట్ట ఉప్పరగూడెం, ఇటుకులగుంట, లింగారాయుడిగూడెం, అమ్ముతపురం, గొల్లగూడెం, అప్పారావుపేట, పుల్లాయగూడెం, నీలాద్రిపురం, కడియద్ద, కొమ్ముగూడెం తదితర గ్రామాల్లో నాట్లు వేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దాళ్వా సీజన్‌కు ముందుగానే బెంగాలీ కూలీలు రావడంతో చకచకా నాట్లు పనులు జరుగుతున్నాయి. సాధారణ కూలీల కంటే బెంగాలీ కూలీలు వేసే నాట్లలో ప్రత్యేకత ఉండటంతో రైతులంతా వీరితోనే నాట్లు వేయించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. బెంగాలీ కూలీలు వేసే నాట్ల వల్ల గాలి, వెలుతురు సమానంగా రావడం, తద్వారా చీడపీడలు లేకపోవడం, దిగుబడులు ఆశాజనకంగా ఉంటున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఈ నెలాఖరు నాటికి మండలంలో నాట్లు వేసే ప్రక్రియ పూర్తి కాగానే, మరొక ప్రాంతానికి బెంగాలీ కూలీలు వెళ్తుంటారని చెబుతున్నారు.

మిచాంగ్ తుపాను ప్రభావంతో ఆలస్యం



మిచాంగ్ తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలు కారణంగా నాట్లు వేసే ప్రక్రియ ఆలస్యమైంది. డిసెంబరు మొదటి వారంలోనే నాట్లు వేయాల్సి ఉండగా, రెండో వారంలో వేస్తున్నాం. మార్చి నాటికి పంట చేతికి రావడంతో తిరిగి మూడో పంటకు అవకాశం ఉంటుంది.

– కందుల త్రినాథ్‌రాజు, రైతు, మోదుగ గుంట

త్వరితగతిన నాట్లు వేసుకోవాలి



రైతాంగం త్వరితగతిన నాట్లు వేసుకోవాలి. తద్వారా మూడవ పంటకు ఆవకాశం కలగడంతో పాటు ఖరీఫ్ సీజన్‌లో పంట వర్షాల బారిన నుంచి రక్షించుకోవచ్చు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి.

– ఆర్ఎస్.ప్రసాద్, మండల వ్యవసాయాధికారి, తాడేపల్లిగూడెం

దేశాభివృద్ధికి ప్రధాని మోదీ కృషి

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశాభివృద్ధికి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ తెలిపారు. సోమవారం పెంటపాడు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నరిసే సోమేశ్వరరావు, రామగాని భాస్కర్ సత్యనారాయణ, దత్తు ప్రసాద్, ఇమ్మంది శ్రీను, కర్రి గిరీష్ రెడ్డి, ఆరాధ్యుల అంజి, సూర్యచంద్రకళ తదితరులు ఉన్నారు. అదే విధంగా వల్లూరుపల్లి గ్రామంలో మోదీ పథకాలను వివరించారు. మారిశెట్టి నరసింహమూర్తి, డి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు అండగా జగన్

ఉండి: మండలంలోని చెరుకువాడ యనాదుల కాలనీకి చెందిన సుమారు 30 మంది తుపాను బాధితులకు సోమవారం గ్రామ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చేతుల మీదుగా నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కష్టం వస్తే ముందుండేది సీఎం జగన్ మాత్రమేనని అన్నారు. బాధితులకు 25 కేజీలు బియ్యం, ఉల్లిపాయలు, బంగాళ దంపలు, కందిపప్పు, వంటనూనె కేజీ చొప్పున పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, సర్పంచ్ కొండవేటి సాంబశివరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కొండవేటి సత్యనారాయణ(సత్తిబాబు), క్రిష్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్రపాటి అనిత, ఎంపీటీసీ చిగురుపాటి కృష్టాఫర్, బందెల ప్రమీల, బొడ్డు నాగన్న, కొండవీటి బాబూరావు, సీఎస్ డీటీ కార్యదర్శి కె.గోపాలకృష్ణ, వీఆర్వో పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నూతన కార్యవర్గం ఎన్నిక

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నూతనకార్యవర్గం సోమవారం ఎన్నికైంది. పట్టణంలో జరిగిన 13వ జిల్లా మహాసభలో నిర్వహించిన కార్యవర్గ ఎన్నికలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడుగా ఎం. రూపాశంకర్, కార్యదర్శిగా సీహెచ్.నాగరాజు ఎన్నికయ్యారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు యు.గనిరాజు ఈ వివరాలు వెల్లడించారు.